# వరి.. వరమా? ఉరా?

**మొదటి పేజీ తరువాయి**

వరి సాగును తగ్గించాలని, నీటి లభ్యత తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని పదే పదే సూచిస్తోంది.అయినప్పటికీ, మన పాలకులు కేవలం "వరి వేయడమే ఒక అద్భుత ప్రగతి" అన్నట్లుగా ప్రచారం కల్పించడంతో.. మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా రైతులంతా ఒకే రకమైన వరి సాగు వైపు గుడ్డిగా అడుగులు వేశారు.ఈ విషయంలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కొంత ముందుచూపుతో వ్యవహరిస్తోందనే చెప్పాలి. ఏపీలో ఉద్దేశపూర్వకంగానే సాంప్రదాయ వరి పంట విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించి, అంతర్జాతీయంగా మంచి గిట్టుబాటు ధరలు లభించే వాణిజ్య పంటలు, ఉద్యానవన తోటలు , ఆయిల్ పామ్ వైపు రైతులను విజయవంతంగా మళ్లిస్తున్నారు. దేశంలోనే రబీ వరి సాగులో తెలంగాణ 59.90 లక్షల ఎకరాల్లో పంట వేస్తే, ఏపీ కేవలం 17.29 లక్షల ఎకరాలకే పరిమితం చేసింది. ఇలా క్రాప్ డైవర్సిఫికేషన్ చేయడం వల్ల ఏపీ రైతులకు డిమాండ్ ఆధారిత గిట్టుబాటు ధర దక్కుతోంది. కానీ తెలంగాణలో మాత్రం మిగులు ధాన్యాన్ని ఏం చేసుకోవాలో తెలియక, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి సేకరించాల్సి వస్తోంది.వాస్తవానికి, వరి పంట ఎప్పుడూ ఒకే రకమైన ఏకపంట విధానానికి దారితీస్తుంది. ఇది భూగర్భ జలాలను, ఉచిత విద్యుత్‌ను విపరీతంగా అడుగంటించడంతో పాటు దీర్ఘకాలంలో భూసారాన్ని కూడా దెబ్బతీస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఎంత శ్రమించినా అంతిమంగా లభించే కనీస మద్దతు ధర పెట్టుబడి ఖర్చులకు మాత్రమే సరిపోతోంది.మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, సిరిధాన్యాలు , హైవాల్యూ ఉద్యానవన పంటల వైపు మన రైతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. తృణధాన్యాలు, కమర్షియల్ పంటలకు సరైన మార్కెటింగ్ నెట్‌వర్క్, కోల్డ్ స్టోరేజీలు కల్పించకపోవడం వల్లే నేటికీ సామాన్య రైతు 'వరి' అనే సురక్షితమైన కానీ తక్కువ లాభదాయకమైన వలయంలోనే చిక్కుకుపోవాల్సి వస్తోంది.ఈ సంక్షోభం నుంచి తెలంగాణ వ్యవసాయ రంగం బయటపడాలంటే.. ఇకనైనా కేవలం రికార్డుల కోసం వరి సాగును పెంచడం ఆపి, మార్కెట్ సెంట్రిక్ పంటల వైపు మళ్లక తప్పదు. ఏ పంట వేస్తే రైతు జేబు నిండుతుందో, ఏ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రేజ్ ఉందో గుర్తించి, వాటికి కూడా పూర్తి స్థాయిలో కొనుగోలు గ్యారెంటీని, రాయితీలను ఇస్తూ పటిష్టమైన పాలసీని తేవాలి. లేనిపక్షంలో, రాష్ట్ర ఖజానాపై 'వరి సేకరణ' భారం పెరిగిపోవడంతో పాటు, దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్నా.. అప్పుల ఊబిలోనే మగ్గిపోయే దుస్థితి తెలంగాణ అన్నదాతకు తప్పదని వ్యవసాయ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# అద్దె కోసం ఆశ..

**మొదటి పేజీ తరువాయి**

ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. పోలీసులు, సంబంధిత శాఖలు దాడులు చేసి షెడ్లు లేదా గోదాములను సీజ్ చేసిన తర్వాతే చాలామంది యజమానులు తాము ఎవరికి అద్దె ఇచ్చామో, అక్కడ ఏం జరుగుతోందో తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత నెలల తరబడి పోలీసు విచారణలు, కోర్టు కేసులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అద్దె ద్వారా వచ్చే ఆదాయం కంటే ఇలాంటి ఇబ్బందులే ఎక్కువ అవుతున్నాయని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అద్దెకు ఇచ్చే ముందు ఆధార్, పాన్, శాశ్వత చిరునామా, మొబైల్ నంబర్, వ్యాపార అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా పరిశీలించాలని, చట్టబద్ధమైన అద్దె ఒప్పందం నమోదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. నకిలీ వ్యాపారాలు కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు.. రైతులు, వినియోగదారులు, స్థానిక ప్రజలు, భవన యజమానులకూ తీవ్ర నష్టం కలిగిస్తాయి. ముఖ్యంగా నకిలీ ఎరువులు, పురుగుమందుల వల్ల రైతులు లక్షల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది. "అద్దె వస్తే చాలు" అనే నిర్లక్ష్య ధోరణి ఇకపై ప్రమాదకరమని, ఎవరికి అద్దె ఇస్తున్నాం.. వారు ఏ వ్యాపారం చేస్తున్నారు.. చట్టబద్ధ అనుమతులు ఉన్నాయా అనే విషయాలు నిర్ధారించుకోవడం ప్రతి భవన యజమాని బాధ్యత" అని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజల అప్రమత్తత, అధికారుల సమన్వయంతోనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.




# ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి

**థాయ్‌లాండ్, సింగపూర్‌లలో వ్యాప్తిలో ఉన్న కొవిడ్ వేరియంటే మన దేశంలోనూ ఉంది**

**గుంపులుగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించండి**

**ఫ్లూ ఉన్నవారు మిగతావారికి దూరంగా ఉండాలి**

**ప్రజలకు సూచిస్తున్న శాస్త్రవేత్తలు**




హైదరాబాద్: 'దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. కొత్తది లేదా ప్రమాదకర వేరియంట్ వచ్చినట్లు ఆధారాల్లేవు' అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. థాయ్‌లాండ్, సింగపూర్ వంటి ఇతర దేశాల్లో వ్యాప్తి చెందుతున్న వేరియంటే మన దేశంలో కూడా ఉందని అంటున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని..అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని వారాల్లో కొవిడ్ కేసులతో నలుగురు చనిపోయారు. చనిపోయినవారు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు అని అక్కడి వైద్యులు చెబుతున్నారు. ఈ కొవిడ్ కేసులకు, సింగపూర్‌లో ప్రస్తుతం నమోదవుతున్న కేసులకు ప్రధానంగా ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 వేరియంటే కారణం అని చెబుతున్నారు. ఒమిక్రాన్ లక్షణాలైన గొంతునొప్పి, దగ్గు, జ్వరం, తలనొప్పి, అలసట, ముక్కుకారడం వంటి సాధారణ ఫ్లూ తరహా లక్షణాలే వీటిలోనూ కన్పిస్తున్నాయని వివరిస్తున్నారు. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా.. గుంపులుగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, ఫ్లూ ఉన్నవారు మిగతా వారికి దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్..
# గృహజ్యోతికి షాక్!

చాలా గృహాల్లో విద్యుత్ వినియోగం 200 యూనిట్ల పరిమితిని అధిగమించింది. ఇది పథకం రూపొందించిన సమయంలో ఊహించని వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడిన సవాలు.పథకం నుంచి బయటకు వచ్చిన వారికి నెలవారీ విద్యుత్ బిల్లులు వస్తాయి. తక్కువ ఆదాయ కుటుంబాలకు ఇది అదనపు ఆర్థిక భారం. జూన్ నెలలోనే లక్షలాది మంది ఈ షాక్‌ను ఎదుర్కొన్నారు. జూలై నెలలో కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనాలు. దీంతో పథకం యొక్క ప్రయోజనం తగ్గిపోతూ, లబ్ధిదారుల విశ్వాసం కూడా ప్రభావితం అవుతుంది.ఈ పరిణామం కేవలం ఒక పథకానికి మాత్రమే పరిమితం కాదు. వాతావరణ మార్పులు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈఏపథ్యంలో గృహాల్లో విద్యుత్ సామర్థ్యం గల ఉపకరణాల వాడకం, అనవసర వినియోగం తగ్గించడం వంటి అలవాట్లు ప్రోత్సహించాలి. ఇళ్లలో ఇన్సులేషన్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లు వంటి చర్యలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులను బట్టి పరిమితులను సర్దుబాటు చేయడం లేదా అదనపు మద్దతు ఇవ్వడం గురించి ఆలోచించాలి.మొత్తంమీద, ఎల్‌నినో సంక్షేమ పథకాలను ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు, ప్రజలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవడం ద్వారా మాత్రమే లబ్ధిదారులకు ఉపశమనం కలుగుతుంది.



## మణుగూరులో మంత్రి పొంగులేటిని
# మర్యాదపూర్వకంగా కలిసిన పినపాక మండల సర్పంచులు

**దశ,పినపాక :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మణుగూరులో పినపాక మండలానికి చెందిన పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి ప్రభుత్వ సహకారం అందించాలని సర్పంచులు కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారికి హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు.

# హైదరాబాద్‌లో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు!

**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు**

హైదరాబాద్: హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల అంశం కలకలం రేపింది. కానిస్టేబుల్ స్థాయి నుంచి సివిల్ సర్వీసెస్‌లో విజేతగా నిలిచిన యువ ఐపీఎస్ నిందితుడు కావటం చర్చనీయాంశంగా మారింది. ఓ ట్రైనీ ఐపీఎస్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం రాత్రి నగరంలోని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



# స్పెయిన్ అద్వితీయం

## రెండోసారి ప్రపంచకప్ కైవసం.. ఫైనల్లో 1-0తో అర్జెంటీనాపై విజయం

న్యూజెర్సీ: స్పెయిన్ అదరహో! అలవాటుగా గోల్ ముందు గోడ కట్టేసి, మేటి ప్రత్యర్థిని ప్రభావ శూన్యంగా మార్చేసి, దూకుడైన ఆటతో దూసుకెళ్లిన ఆ జట్టు అపురూప విజయాన్నందుకుంది. స్టార్లు లేకున్నా సమష్టిగా సత్తా చాటుతూ ఫుట్‌బాల్ జగజ్జేతగా నిలిచింది. కలల కప్పును రెండోసారి సగర్వంగా ముద్దాడింది.
దుర్భేద్యమైన డిఫెన్స్‌తో పాటు పదునైన ఎటాక్‌తో ఆధిపత్యం ప్రదర్శించిన స్పెయిన్ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను మట్టికరిపించింది. అదనపు సమయంలో గోల్‌తో టోరెస్ స్పెయిన్ హీరోగా నిలిచాడు. టోర్నీ ఆరంభం నుంచి ప్రత్యర్థులను తన గోల్‌కు ఆమడ దూరంలో పెట్టిన స్పెయిన్.. ఫైనల్లో అర్జెంటీనానూ దరిచేరనివ్వలేదు. స్పెయిన్ దూకుడుతో బంతి చాలా వరకు తమ అర్ధభాగంలోనే ఉండడంతో సూపర్‌స్టార్ మెస్సి నిస్సహాయుడిగా మిగిలిపోయాడు. అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ అద్భుత పోరాటంతో ఎన్నో సేవ్‌లు చేసినా ఫలితం లేకపోయింది. స్పెయిన్‌దే ఫుట్‌బాల్ ప్రపంచకప్. ఆ జట్టు దూకుడు ముందు అర్జెంటీనా తేలిపోయింది. సోమవారం తెల్లవారుజామున 3.30కు ముగిసిన ఈ ఫైనల్లో స్పెయిన్ 10తో అర్జెంటీనాపై విజయం సాధించింది. అదనపు సమయానికి దారితీసిన మ్యాచ్‌లో టోరెస్ (106వ) స్పెయిన్‌కు గెలుపు గోల్‌ను అందించాడు. ఆద్యంతం ఆత్మరక్షణకే పరిమితమైన అర్జెంటీనా గోల్ ప్రయత్నాలే చేయలేకపోయింది. మ్యాచ్‌లో స్పెయిన్‌దే తిరుగులేని ఆధిపత్యం. నిర్విరామంగా దాడులు చేస్తూ ఆఖరి వరకు ప్రత్యర్థి రక్షణశ్రేణిని పరీక్షిస్తూనే పోయింది. ఆ జట్టు అయిదో నిమిషంలో గోల్ కొట్టినంత పనిచేసింది. యువ సంచలనం యమాల్.. అర్జెంటీనాను కలవరపెట్టాడు. యమాల్ బాక్స్ వైపు వెళ్తూ సహచరుడు ఒల్మోకు బంతిని అందించాడు. అతడు తిరిగి యమాల్ వైపు పంపించాడు. అతడి షాట్ అర్జెంటీనా ఆటగాడు లిసాండ్రో మార్టినెజ్ కాలికి తగిలి వెళ్లగా.. గోల్‌కీపర్ ఎమి మార్టినెజ్ సేవ్ చేశాడు. వేగంగా పాస్‌లు ఇచ్చుకుంటూ స్పెయిన్ దూకుడు కొనసాగించింది. మిడ్‌ఫీల్డ్‌లో స్పెయిన్ కెప్టెన్ రోడ్రి పాదరసంలా కదిలాడు. బంతి తన దగ్గర నుంచి వెళ్లినా.. తిరిగి నియంత్రణలోకి తెచ్చుకోవడానికి స్పెయిన్ ఎక్కువ సమయమేమీ తీసుకోలేదు. కొద్దిసేపట్లో తొలి అర్ధభాగం ముగుస్తుందనగా అర్జెంటీనా సెంటర్ హాఫ్ లిసాండ్రో మార్టినెజ్ యెల్లో కార్డును అందుకున్నాడు. అతడు ఒయర్జబాల్‌ను పడేశాడు. అయితే ఆ తర్వాత లిసాండ్రో గాయపడడంతో అతడి స్థానంలో ఒటామెండి వచ్చాడు. తొలి అర్ధభాగంలో అర్జెంటీనా స్టార్ మెస్సి పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ద్వితీయార్ధంలో దాడులు మరింత ఉధృతం చేసిన స్పెయిన్.. అర్జెంటీనా డిఫెన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. బంతి ఎప్పుడూ అర్జెంటీనా అర్ధభాగంలోనే. గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ పుణ్యమా అని మ్యాచ్‌ను అర్జెంటీనా అదనపు సమయానికి తీసుకెళ్లింది.
గోల్ ముందు హీరోచితంగా పోరాడిన మార్టినెజ్ ఎన్ని సేవ్‌లు చేశాడో లెక్క లేదు. అతడే లేకుంటే స్పెయిన్ నిర్ణీత సమయానికే అలవోకగా విజయాన్నందుకునేది. అయితే స్టాపేజ్ టైమ్‌లో ఎంజో ఫెర్నాండెజ్ రెడ్ కార్డుతో మైదానాన్ని వీడడం అర్జెంటీనాకు షాక్. ఆ జట్టు పది మందికే పరిమితమైంది. అది స్పెయిన్‌కు కలిసొచ్చింది. ఎట్టకేలకు అదనపు సమయం ద్వితీయార్ధంలో ఫెరాన్ టోరెస్ (106వ) గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన స్పెయిన్ సంబరాల్లో మునిగిపోయింది. బాక్స్‌లో ఓ క్రాస్‌ను నికో విలియమ్స్ (స్పెయిన్) తలతో కొట్టగా.. తన దగ్గరికి వచ్చిన బంతిని టోరెస్ ఎడమ కాలితో నెట్లోకి కొట్టాడు. తర్వాత అర్జెంటీనాకు స్కోరు సమం చేసేందుకు సమయం సరిపోలేదు.

### గోల్డెన్ బూట్ ఎంబాపెదే

ఈ ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడికిచ్చే గోల్డెన్ బూట్‌ను ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబాపె దక్కించుకున్నాడు. టోర్నీ ఆద్యంతం అద్భుత ఫామ్ కొనసాగించిన అతడు మొత్తం 10 సార్లు బంతిని నెట్లోకి పంపాడు. అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సి 8 గోల్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు.

### విజేతకు రూ.481 కోట్లు

న్యూజెర్సీ: ఫిఫా ప్రపంచకప్ విజేత భారీ నగదు బహుమతి దక్కించుకుంది. మొత్తం ప్రైజ్‌మనీ రూ.6,306 కోట్లు కాగా.. ఇది గత ప్రపంచకప్‌లో ఇచ్చిన మొత్తం కంటే 50 శాతం అధికం. ఛాంపియన్ జట్టు సుమారు రూ.481 కోట్లు సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన జట్టు రూ.317 కోట్లు అందుకుంది. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన ఇంగ్లాండ్, ఫ్రాన్స్ వరుసగా రూ. 279 కోట్లు, రూ.259 కోట్లు దక్కించుకున్నాయి. క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించిన జట్లు రూ.182 కోట్లు, ప్రీక్వార్టర్స్‌లో వెనుదిరిగిన టీమ్‌లు రూ.144 కోట్లు చొప్పున అందుకున్నాయి. గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టిన ప్రతి జట్టుకు రూ.105 కోట్లు లభించాయి.

**1**


6 వేర్వేరు ప్రపంచకప్‌ల్లో గోల్ కొట్టిన తొలి ఆటగాడిగా క్రిస్టియానో రొనాల్డో ఘనత సాధించాడు. మెస్సి 5 ప్రపంచకప్‌ల్లో గోల్ కొట్టాడు. 2010 టోర్నీలో అతడు గోల్ కొట్టలేదు.

**15**

ఈసారి టోర్నీలో ఇచ్చిన రెడ్ కార్డులు. ఒక ప్రపంచకప్‌లో ఇదే అత్యధికం. గత రెండు టోర్నీల్లో (2018, 2022)లో కలిపి 8 రెడ్ కార్డులే ఇచ్చారు.

**71**

కురసావ్‌పై జర్మనీ గెలుపు తేడా. ఈ ప్రపంచకప్‌లో ఇదే అతిపెద్ద విజయం. మొత్తంగా టోర్నీ చరిత్రలో హంగేరి 101తో ఎల్ సాల్వడార్ (1982లో)పై సాధించిన గెలుపే అత్యంత పెద్దది.
తుర్కియేతో మ్యాచ్‌లో తొలి 65 సెకన్లకే పరాగ్వే ఆటగాడు గలార్జా స్కోర్ చేశాడు. ఈ ప్రపంచకప్‌లో అతి తక్కువ సమయంలో నమోదైన గోల్ ఇదే. తుర్కియేకు చెందిన సుకుర్.. దక్షిణ కొరియాపై 11 సెకన్లకే (2002లో) గోల్ కొట్టి టోర్నీ రికార్డు నెలకొల్పాడు.
ఈసారి టోర్నీలో అడుగు పెట్టిన కురసావ్.. ప్రపంచకప్ ఆడిన అతిచిన్న దేశం (1.5 లక్షల జనాభా)గా నిలిచింది.



Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com